క్లుప్తంగా

12 నుంచి సమావేశాలు

లింగసముద్రం: మండలంలోని 13 రైతు సేవా కేంద్రాల్లో ఈ నెల 12 నుంచి 21వ తేదీ వరకు రైతులకు పంటసాగు హక్కు కార్డుల కోసం సమావేశాలు నిర్వహించనున్నట్లు వ్యవసాయాధికారి టి.అబ్రహంలింకన్ గురువారం తెలిపారు. 12న ముత్యాలపాడు, పెదపవని, 15న పెదపవని-2, చినపవని, 16న అన్నెబోయినపల్లె, వీఆర్‌కోట, 18న మాలకొండ్రాయునిపాలెం, తిమ్మారెడ్డిపాలెం, 19న యర్రారెడ్డిపాలెం, లింగసముద్రం-1, 20న లింగసముద్రం-2, పెంట్రాల, 21న మొగిలిచర్ల రైతు సేవాకేంద్రాల్లో ఈ సమావేశాలు నిర్వహిస్తామన్నారు. సమావేశాల్లో వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది, వ్యవసాయ సిబ్బంది పాల్గొంటారని తెలిపారు. రైతులు రైతు సేవా కేంద్రాల్లో ఈ సమావేశాలకు హాజరై పంటలసాగు హక్కు కార్డులు పొందాల్సిందిగా ఏఓ కోరారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

లింగసముద్రం: విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని అందించాలని ఎంఈఓ-2 శివకుమార్ అన్నారు. మండలంలోని ముత్తంవారిపాలెంలోని ఎంపీపీ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను పంపిణీ చేసి వారి సామర్థ్యాన్ని పరీక్షించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి రుచి చూశారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజన నిర్వాహకులు తమ సొంత బిడ్డల్లా భావించి రుచిగా, శుచిగా వండి వడ్డించాలన్నారు. పాఠశాలకు నూరుశాతం విద్యార్థులు హాజరయ్యేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డీఈఓ ఆకస్మిక తనిఖీ

జరుగుమల్లి (సింగరాయకొండ): జరుగుమల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డీఈఓ సుభద్ర గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల నైపుణ్యాలను పరిశీలించారు. అలాగే రికార్డుల గురించి తెలుసుకున్నారు. ఎంఈఓ బి. నాగేంద్రవదన్, ప్రధానోపాధ్యాయుడు మర్రి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి చేయాలి

పీసీపల్లి: విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంఈఓలు శ్రీను, సంజీవ్ అన్నారు. మండల పరిధిలోని చింతగుంపల్లిలో ఎంపీపీఎస్ పాఠశాలలో గురువారం జరిగిన పేరెంట్స్ కమిటీ, విద్యార్థులకు పుస్తకాల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాత పోలిశెట్టి చొడయ్య అందించిన విద్యాసామగ్రిని విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల విద్యాభివృద్ధికి దాతలు ముందుకు రావాలన్నారు.

డిగ్రీ ఫలితాల్లో ఎంఎస్‌ఎం విద్యార్థుల ప్రతిభ


కామిరెడ్డి ధనలక్ష్మి


కె. మౌనిక


కె.మనిషా

కనిగిరి రూరల్: ఆచార్య నాగార్జున యూనివర్శిటీ డిగ్రీ నాల్గవ సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో ఎంఎస్ఎం(జీసీఅండ్ వైపీఎస్) డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. బీఎస్సీ, బీజెడ్‌సీలో కామిరెడ్డి ధనలక్ష్మి 986, ఎస్‌కే రజీఫ్ 984 మార్కులు సాధించారు. బీఎస్సీ అగ్రికల్చర్‌లో కొమెర్ల మౌనిక 960, కనపర్తి మహేశ్వరి 934/1000 మార్కులు సాధించారు. బీఎస్సీ/ఎంపీసీఎస్ ముక్కు మనీషా 803/900 మార్కులు, బీకాం / కంప్యూటర్‌లో దాసరి యామిని 698 మార్కులు సాధించారు. ప్రతిభ చాటిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్, ఏలూరి సుబ్బారావు, ఏలూరి నరేస్ చౌదరి, అధ్యాపకులు గురువారం అభినందించారు.

జూనియర్ అసిస్టెంట్ గది తాళాలు తొలగింపు


జూనియర్ అసిస్టెంట్ గది తాళాలు కట్ చేస్తున్న పంచాయతీ సిబ్బంది

సింగరాయకొండ: స్థానిక పంచాయతీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ గదికి వేసిన తాళాలను డీపీఓ టి. ఉషారాణి ఆదేశాలతో తొలగించినట్లు ఎంపీడీఓ నాగేష్‌కుమారి తెలిపారు. ఇటీవల జూనియర్ అసిస్టెంట్ తన గదికి తాళాలు వేసుకుని సెలవుపై వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో డీపీఓ ఆదేశాల మేరకు గురువారం మధ్యాహ్నం 12 గంటలకు తాళాలు కట్ చేసి గది తలుపులు తెరిపించారు. కాగా ఇటీవల సర్పంచ్ కూడా మరో తాళం వేయడంతో దానిని కూడా కట్ చేశారు. ఈ ప్రక్రియ ఈఓఆర్‌డీ సుధాకర్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ పంచనామాలో ఎంపీడీఓ కార్యాలయ ఏఓ బీవీ నర్సింహమూర్తి, ఈఓ రామకోటయ్య, పోలీసులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

హామీ అమలు చేయాలి



మా అమ్మాయి కనిగిరిలోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతుంది. మా అబ్బాయి ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. టీడీపీ అధికారంలోకి వస్తే ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అందరికీ రూ.15 వేల చొప్పున ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రైవేట్ కాలేజీల్లో చేరేటప్పుడే ఫీజు చెల్లించాలి. తల్లికి వందనం నగదు వెంటనే చెల్లిస్తే మా అమ్మాయికి ఫీజు చెల్లిస్తాం. హామీ మేరకు మా ఇద్దరి పిల్లలకు రూ.15 వేల చొప్పున ఇవ్వాలి

పాపాబత్తుని శైలజ, వెలిగండ్ల

అందరికీ ఇవ్వాలి..



ఇంట్లో ఎంత మంది పిల్లలు పాఠశాలకు వెళితే అందరికీ రూ.15 వేల చొప్పున ఇస్తామని హామీ ఇచ్చారు. ఇప్పుడు ఒక్కరికే ఇస్తామంటూ కుదరదు. నాకు ఇద్దరు పిల్లలు ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్నారు. ఫీజులు కట్టమని పాఠశాలల్లో అడుగుతున్నారు. గతంలో అమ్మఒడి చెప్పిన సమయానికే వేశారు. ఇప్పుడు ఎప్పుడు ఇస్తారో తెలియడం లేదు.

– నర్రా కృష్ణవేణి, వలేటివారిపాలెం

మాట నిలబెట్టుకోవాలి



ఎన్నికలకు ముందు కుటుంబంలో ఎంత పిల్లలు చదువుతుంటే అందరికీ రూ.15 వేల చొప్పున ఇస్తామని హామీ ఇచ్చారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తరువాత ఆ మాటను నిలబెట్టుకోవాలి. తల్లులంతా ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వంలో అమ్మఒడి నగదు ఠంచన్‌గా అందేవి. ఇప్పుడు మాయ మాటలతో కాలయాపన చేస్తున్నారు.

– మరియమ్మ, అన్నెబోయినపల్లె.

మోసం..దగా..

- ఒకే బిడ్డకు తల్లికి వందనం అంటూ జీఓ విడుదల
- ప్రభుత్వ తీరుపై తల్లుల ఆగ్రహం
- మళ్లీ మోసం చేయాలని చూస్తున్నారని మండిపాటు


కూటమి ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన తల్లికి వందనం హామీ


వలేటివారిపాలెంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

కందుకూరు: ఏరు దాటిందాకా ఓడ మల్లనా...ఏరు దాటిన తరువాత బోడి మల్లన అన్న సామెతగా ఉంది కూటమి ప్రభుత్వం తీరు ప్రస్తుతం. ఎన్నికల్లో గెలుపు కోసం నోటికి వచ్చిన హామీలు ఇవ్వడం, ఎన్నికల్లో గెలవగానే వాటిని తుంగలో తొక్కడం పరిపాటిగా మారిపోయింది. ఇదే కోవలో ప్రస్తుతం అధికారంలోకి వచ్చి నెల రోజులు కూడా కాక ముందే మరో కీలకమైన హామీకి మంగళంపాడే దిశ కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుంది. ప్రభుత్వంపై కోటి ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రుల ఆశలపై నీళ్ల చల్లే విధంగా చర్యలు ప్రారంభించింది. దీనిపై అటు తల్లిదండ్రుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతుంది.

గత వైఎస్సార్ సీపీ అమ్మఒడి పేరు పథకం పేరుతో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు ఏడాదికి రూ.15వేల చొప్పున వారి తల్లిదండ్రుల ఖాతాల్లో వేసింది. అయితే ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం ఈ పథకం పేరును తల్లికి వందనంగా మార్చింది. ప్రస్తుతం పాఠశాలలు ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా ఈ పథకం కింద ఒక్క రూపాయి కూడా జమ కాలేదు. ఎన్నికల ప్రచారంలో ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తల్లికి వందనం పథకం కింద ఇంట్లో ఎంత మంది పిల్లలు పాఠశాలకు వెళ్తుంటే అంత మందికి ఈ పథకాన్ని వర్తింప చేస్తామని హామీ ఇచ్చారు. కానీ అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన హామీకి తూట్లు పొడిచేలా ప్రభుత్వం అడుగులు వేస్తుంది. ఇంట్లో ఒకరికి మాత్రమే ఈ తల్లివందనం పథకం కింద రూ.15వేలు ఇస్తామంటూ మెలిక పెట్టింది. ఈ మేరకు ప్రభుత్వం జీఓను విడుదల చేసింది. దీనిపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉదాహరణకు ఒక కందుకూరు కందుకూరు మున్సిపాలిటీ, మండల పరిధిలోని 71 ప్రభుత్వ పాఠశాలలో 5,160 మంది విద్యార్థులు చదువుతుండగా, 16 ప్రైవేట్ పాఠశాలలో 9,756 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇలా నియోజకవర్గ వ్యాప్తంగా వేల మంది పిల్లలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్నారు. వీరందరికి తల్లికి వందనం కింద ఏడాదికి రూ.15వేల చొప్పున డబ్బులు ఇవ్వాల్సి ఉంది. కానీ కుటుంబంలో ఒక పిల్లవాడికి మాత్రమే ఇస్తామంటూ జీఓ విడుదల చేయడంపై తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబునాయుడిని నమ్మి మరోసారి మోసపోయామంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తల్లులను మోసం చేయడమే



ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అందరికీ తల్లికి వందనం అమలు చేయాలి. అలా కాకుండా ఒక్కరికే ఇస్తామని చెప్పడం మోసం చేయడమే. అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే మాట తప్పడం మంచిది కాదు. నాకు ఇద్దరు పిల్లలు. ఎన్నికల హామీ మేరకు ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున రూ.30 వేలు జమ చేయాలి.- జమ్ము లక్ష్మి రాజ్యం, రామాయపట్నం

డబ్బులు ఎప్పుడు వస్తాయో:



నాకు ముగ్గురు పిల్లలు. ఈ ఎన్నికల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు తల్లికి వందనం పథకం కింద ఒక తల్లికి, ఎంత మంది పిల్లలున్నా ప్రతి ఒక్కరికి 15 వేల రూపాయలు ఇస్తానని ప్రకటించారు. నా పిల్లలు ముగ్గురు ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్నారు. ఈ పథకం కింద డబ్బులు వస్తే ఫీజులు కట్టుకోవటానికి ఆదరువుగా ఉంటుంది. కానీ డబ్బులు ఎప్పుడు వస్తాయో అర్థం కావటం లేదు. గత ప్రభుత్వంలో ఈపాటికే అమ్మ ఒడి డబ్బులు అందాయి.

పురిణి అనిత, ఊళ్లపాలెం

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక


జి. మహోల


నాగ వెంకట సాయి


చిడిపోతు అమృత


పేరం యొహోషువా


ఆర్. అర్చన


ఆర్. రమ్య


ఎన్. ప్రత్యూషా


కె. కళ్యాణి

టంగుటూరు: ప్రభుత్వం గురువారం ప్రకటించిన ట్రిపుల్ ఐటీ ఫలితాల్లో జమ్ములపాలెం, ఆలకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న నలుగురు విద్యార్థులు సీట్లు సాధించారని ఎంఈఓ - 2 బాలాజీ గురువారం తెలిపారు. జమ్ములపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని జి. మహోల శ్రీకాకుళంలో, ఆలకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉప్పుతెర్ల నాగ వెంకట సాయి, చిడిపోతు అమృత నూజివీడులో, పేరం యొహోషువా ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. వీరిని గ్రామ పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

మద్దిపూడి: మండలంలోని కాకర్ల, మద్దిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకుని 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన నలుగు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకు ఎంపికైనట్లు ఎంఈఓ ఎంవీవీ రంగయ్య గురువారం తెలిపారు. కాకర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఆర్. అర్చన కృష్ణాజిల్లా నూజువీడులో, సీహెచ్ రమ్య ఒంగోలు, మద్దిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న ఎన్. ప్రత్యూష నూజువీడు, కె. కళ్యాణి శ్రీకాకుళంలో సీట్లు సాధించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుని త్రిపుల్ ఐటీలో కళాశాలల్లో సీట్లు సాధించిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు బీడీ కిషోర్‌కుమార్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

పీసీపల్లి: ట్రిపుల్ ఐటీ ఫలితాల్లో పీసీపల్లికి చెందిన 21 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఎంపికైనట్లు ఎంఈఓలు ఆర్ శ్రీనివాసులు, సంజీవ్ తెలిపారు. మండలంలోని పీసీపల్లి జెడ్పీహెచ్ఎస్ నుంచి ఏడుగురు, గుంటుపల్లి జెడ్పీహెచ్ఎస్ నుంచి నలుగురు, పీఐపాడు జెడ్పీహెచ్ఎస్ నుంచి ముగ్గురు, కేజీబీవీ పీసీపల్లి నుంచి ముగ్గురు, నేరేడుపల్లి జెడ్పీహెచ్ఎస్ నుంచి ఇద్దరు, మురుగమ్మి జెడ్పీహెచ్ఎస్ 1, పీఏపాడు జెడ్పీహెచ్ ఎస్ నుండి ఒకరు ఎంపికయ్యారన్నారు.

హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోండి


మాట్లాడుతున్న జడ్జి కె.భరత్‌చంద్ర

కనిగిరి రూరల్: వాహనదారులు హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జడ్జి కె.భరత్‌చంద్ర అన్నారు. పట్టణంలో గురువారం హెల్మెట్ వాడకం, ఉపయోగాలపై అవగాహన కార్యక్రమం, బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో జడ్జి కె. భరత్‌చంద్ర హెల్మెట్ భారం కాదని, మన బాధ్యత అని వర్ణించారు. వాహనాల చట్టంతో పాటు, రైడర్ తో పాటు పిలియన్ రైడర్ కూడ హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ఉపయోగాలను గురించి వివరించారు. రోడ్డు భద్రతా నిబంధనలు పాటించన వారిపై రూ.1000 జరిమానాతో పాటు నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు కూడా నమోదు చేసి లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. తొలుత స్థానిక కోర్టు ప్రాంతం నుంచి ఆర్టీసీ డిపో, ప్రధాన వీధుల్లో, ద్విచక్ర వాహనలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ దాసరి వెంకటేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, ఎస్సై టి.త్యాగరాజు, బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు, న్యాయవాదుల గుమస్తాలు పాల్గొన్నారు.

కౌలు రైతులను గుర్తించాలి

హనుమంతునిపాడు: మండలంలోని 14 రైతు సేవా కేంద్రాల పరిధిలో కౌలు రైతుల అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని తహసీల్దార్ కె.కిషోర్‌రెడ్డి అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీఆర్‌ఓలు, వీఏఏలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు రైతుల ఎంపిక చేసేముందు కౌలు రైతులకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. శుక్రవారం నుంచి మూడు రోజుల్లో 14 రైతు సేవాకేంద్రంలో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. అనంతరం అర్హులైన వారిని గుర్తించి కౌలు కార్డులు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు, వీఏఏలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో తెగుళ్ల నివారణ

పీసీపల్లి: యాజమాన్య పద్ధతులతో బత్తాయి తోటలో తెగుళ్లు నివారించుకోవచ్చని కృషి విజ్ఞాన శాస్త్రవేత్త శివ తెలిపారు. మండల పరిధిలోని చింతగుంపల్లిలో గురువారం రైతులు సాగు చేసిన బత్తాయి తోటను పామూరు ఉద్యానవన అధికారి కుసుమతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బత్తాయి తోటల్లో తెగుళ్లు సోకడం వల్ల వేరు వ్యవస్థ దెబ్బతిని కణజాలం దెబ్బతింటుందన్నారు. వీటి నివారణకు వ్యవసాయాధికారులు సూచించిన సూచనలు పాటించి నివారించవచ్చన్నారు. ఉద్యానవన సహాయకుడు షేక్ నాయబ్‌రసూల్ రైతులు పాల్గొన్నారు.

పాఠశాలకు వితరణ

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని నల్లమడుగుల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు గ్రామానికి చెందిన పాఠశాల పూర్వ విద్యార్థులు పి.నాగిరెడ్డి, మనోజ్‌కుమార్‌లు ర్యాక్‌లు, నోట్‌బుక్స్ విరాళం ప్రకటించారు. దాతలు నాగిరెడ్డి, మనోజ్‌లు 3 ఇనుప ర్యాక్‌లు, విద్యార్థుల కోసం నోట్‌బుక్స్‌ను పాఠశాల హెచ్‌ఎం మహమ్మద్‌కు అందజేశారు. ఉపాధ్యాయురాలు అనూరాధ పాల్గొన్నారు.

నాగేశ్వరరావు మృతి పార్టీకి తీరని లోటు


నాగేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్

మద్దిపూడి: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పోటు నాగేశ్వరరావు మృతి పార్టీకి తీరని లోటని మాజీ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. గురువారం మండలంలోని చిమట పడమటి కొత్తూరు గ్రామానికి చెందిన పోటు నాగేశ్వరరావు (70) అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన దశదిన కార్యక్రమానికి మంత్రి హాజరయ్యారు. నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన కుమారుడు రామకృష్ణ, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపి, వారి కుటుంబానికి అండగా ఉంటామన్నారు. జెడ్పీటీసీ సభ్యులు మాకినేని సుధారాణి వెంకట్రావు, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు బోద రమణారెడ్డి, సర్పంచ్ పులిచర్ల లక్ష్మమ్మ రామిరెడ్డి, ఇనుకొల్లు సుబ్బారెడ్డి, ధర్మవరం సర్పంచ్ గంగిరెడ్డి రమణారెడ్డి, తానికొండ రమేష్, రమణయ్య, నరసింహారావు, సురేష్, ఇనుకొల్లు జగన్‌రెడ్డి పాల్గొన్నారు.


బాసు వెంకటేశ్వరరెడ్డిని పరామర్శిస్తున్న ఇన్‌చార్జ్ దద్దాల, నాయకులు

కార్యకర్తలకు అండగా ఉంటా

- వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ


గుంటుపల్లి సుబ్బరామయ్యను పరామర్శిస్తున్న ఇన్‌చార్జ్ దద్దాల, నాయకులు

పామూరు: వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు అన్ని వేళలా అందుబాటులో అండగా ఉంటానని వైఎస్సార్ సీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణయాదవ్ అన్నారు. మండలంలో గురువారం ఆయన విస్తృత పర్యటన చేశారు. ఈసందర్భంగా మండలంలోని నర్రమారెళ్ల వెళ్లి అక్కడ వైఎస్ ఎంపీపీ గంధం యేసురత్నంతో కలిసి నర్రమారెళ్ల పంచాయతీలో పార్టీ బలోపేతంపై చర్చించారు. అనంతరం అదేగ్రామంలో గుండె సంబంధిత సమస్యతో బైపాస్ సర్జరీ చేయించుకున్న వైఎస్సార్ సీపీ నాయకుడు గుంటుపల్లి సుబ్బరామయ్యను పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకుని త్వరగా కోరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం మండలంలోని చెంచిరెడ్డిపల్లె వెళ్లిన ఆయన ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ బాసు వెంకటేశ్వరరెడ్డిని పరామర్శించి ఆరోగ్యంపై చర్చించి కుటుంబసభ్యులతో ప్రమాద ఘటనపై వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి, జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ షేక్.చాంద్‌బాషా, వైస్ ఎంపీపీ ఏసురత్నం, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, జి.గోవిందయ్య, సచివాలయ కన్వీనర్ గయాజ్, దగ్గుల వెంకటేశ్వరరెడ్డి, చిన్న, పెద్దయ్య, సామ్యేలు, దావీదు, జాన్, కటికాల వెంకటరత్నం, ఎస్.ఏడుకొండలు రెడ్డి, జి.శ్రీను, సామ్యేలు, దావీదు, రమణారెడ్డి, జాన్, డి.వెంకటేశ్వర్లు పలువురు పాల్గొన్నారు.

పెద్ద కొండయ్య మృతి పార్టీకి తీరని లోటు


పెద్దకొండయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఇన్‌చార్జి దద్దాల, నాయకులు

పామూరు: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు గంటా పెద్ద కొండయ్య మృతి పార్టీకి తీరని లోటని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణయాదవ్ అన్నారు. మండలంలోని అపమాం బాపురంకు చెందిన గంటా పెద్ద కొండయ్య ఇటీవల మృతి చెందగా గురువారం ఆయన నివాసం వద్ద సంతాపసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద కొండయ్య చిత్రపటానికి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల, జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య, పార్టీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి, పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా దద్దాల మాట్లాడుతూ మండలంలో వైఎస్సార్ సీపీకి పెద్దకొండయ్య అండగా నిలిచారన్నారు. ఆయన కుటుంబానికి పార్టీ, తాను ఎప్పుడూ తోడుగా ఉంటామని ఆయన కుమారుడు ఎస్సీసెల్ నాయకులు గంటా రమణయ్యకు భరోసా ఇచ్చారు. ఏఎంసీ వైస్ చైర్మన్ షేక్.చాంద్ బాషా, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, జి.గోవిందయ్య, కటికాల వెంకటరత్నం, గంటా రమణయ్య, గంధం భాస్కర్, ఎలికా అచ్చయ్య, సూరిపోగు మాల్యాద్రి, శ్రీరాం శ్రీనివాసులు, పిడికిటి వెంకటనారాయణ, నీలం వెంకటేశ్వర్లు, మాల్యాద్రి, వెంకటరెడ్డి, బాలకృష్ణ పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల దాడులు

మద్దిపూడి: మండలంలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడిన వారిపై విజిలెన్స్ అధికారులు గురువారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న 22 మందిని గుర్తించి, రూ. 20,900 అపరాధ రుసుం విధించినట్లు విజిలెన్స్ విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కట్టా వెంకటేశ్వర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆపరేషన్ దర్శి ఎస్ఏ కరీమ్‌లు తెలిపారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మండలంలో 16 మంది విద్యుత్‌శాఖాధికారులు, 85 మంది సిబ్బందితో 3222 సర్వీస్‌లు ఆకస్మిక తనిఖీలు చేశామన్నారు. అదనపులోడు వాడుకున్న 18 మందికి రూ. 14900 అనుమతించిన కేటగిరి కాకుండా ఇతర కేటగిరీలో వాడుకున్న నలుగురికి రూ. 6వేలు అపరాధ రుసుం విధించినట్లు చెప్పారు. అక్రమంగా విద్యుత్ వినియోగించుకుంటే కఠిన చర్యలు తప్పవనిహెచ్చరించారు. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌లు, ఆపరేషన్ సెక్షన్ పొదిలి, దర్శి, చీమకుర్తి కె. శ్రీనివాసరెడ్డి, కె. పిచ్చెయ్య, డీవీ కృష్ణారెడ్డి, ఏ. శ్రీనివాసరావు, ఏఈలు, జేఈలు, లైన్‌ఇన్‌స్పెక్టర్, లైన్‌మెన్‌లు పాల్గొన్నారు.

చిన్న కుటుంబం చింత లేని కుటుంబం


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ గఫార్

కనిగిరి రూరల్: చిన్న కుటుంబం చింత లేని కుటుంబం అని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక కాశిరెడ్డి కాలనీలో వైద్య శాఖ, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ జనాభ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా రోజు రోజుకు పెరుగుతున్న జనాభాను నియంత్రించేందుకు, స్త్రీ పురుషుల మధ్య సమానత్వం, మానవహక్కులు, బాల్య వివాహాలు, కుటుంబ సంక్షేమం, అధిక జనాభ వల్ల కలిగే నష్టాలను అవగాహన కల్పించారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సృజన మాట్లాడుతూ సంపూర్ణ అక్షరాస్యత సాధించినప్పుడే, అధిక జనాభా వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్గుతాయన్నారు. ప్రతి ఒక్కరూ జనాభ నియంత్రణ, కుటుంబ నియంత్రణ పాటించాలన్నారు. సచివాలయం ఏఎన్‌ఎం ఎం లక్ష్మీ, ఫౌండేషన్ చైర్మన్ మంద్రు రమేష్, కో ఆర్డినేటర్ పి.నవకుమార్, తదితరులు పాల్గొన్నారు.

పలువురికి దద్దాల పరామర్శ


ఒబ్బిరెడ్డిపల్లెలో మితికాల గురవయ్యను పరామర్శిస్తున్న దద్దాల

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని ఒబ్బిరెడ్డిపల్లె, డీజీపేట గ్రామాల్లో వైఎస్సార్ సీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల పర్యటించి పలువురితో పార్టీ బలోపేతంపై చర్చించి అనంతరం రోడ్డు ప్రమాదానికి గురైచికిత్స పొందుతున్న నాయకులను పరామర్శించారు. ఈ సందర్భంగా మండలంలోని ఒబ్బిరెడ్డిపల్లెకు వెళ్లి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ పార్టీ బీసీసెల్ నాయకులు మితికాల గురవయ్యను పరామర్శించి ఆరోగ్యంపై చర్చించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం డీజీపేటకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, సింగిల్‌విండో డైరెక్టర్ వాడా లక్ష్మిరెడ్డి, నేరెళ్ల జగన్‌తో సమావేశంపై పంచాయతీలో పార్టీ బలోపేతంపై చర్చించారు. వి.బైలు సర్పంచ్ వెంగళరావు, డాక్టర్ షేక్.గౌస్, బత్తుల దేవరాజు, తమ్మిశెట్టి రమణయ్య, చీపి వెంకట రమణయ్య, బక్క జోసఫ్, దేవదానం, ఏసురత్నం, భాగ్యరాజు, చీపి అంజి, షేక్.ఖాజావలి, గొబ్బెల్ల శ్రీను, యస్.జైపాల్, సొద్దల మాలకొండయ్య పలువురు పాల్గొన్నారు.